క్లుప్తంగా

నేడు డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ

జనగామ: ప్రాథమిక పాఠశాల్లో 1 నుంచి 5 తరగతి విద్యార్థులకు గణిత సబ్జెక్టును బోధించే టీచర్లకు డిజిటల్ అక్షరాస్యత, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) బోధన తీరుతెన్నులపై మండల రిసోర్స్ పర్సన్లకు నేడు(బుధవారం) శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా కేంద్రంలోని హైదరాబాద్‌రోడ్డు సెయింట్ మెరీస్ హైస్కూల్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు గణిత శాస్త్రం బోధనలో డిజిటల్ విద్యను అందించేందుకు రాష్ట్ర విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లా నుంచి నలుగురు నుంచి ఐదుగురు చొప్పున హైదరాబాద్‌లో జిల్లా రిసోర్స్ పర్సన్ల(డీఆర్‌పీ)కు గతంలోనే శిక్షణ ఇచ్చారు. డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ పొందిన డీఆర్‌పీలు 70 మంది మండల రిసోర్స్ పర్సన్లకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో దీనిపై సంపూర్ణ అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఈ నెలలో జరిగే 2వ కాంప్లెక్స్ సమావేశాల్లో మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయులకు డిజిటల్ అక్షరాస్యతపై శిక్షణ ఇవ్వనున్నారు.

విద్యార్థికి ఆర్థికసాయం



జనగామ: పట్టణానికి చెందిన విద్యార్థి బుక్క ఉజ్వల్ ఉన్నత చదువుల కోసం వాసవీ క్లబ్ గెలాక్సీ, ఐవీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.80,500 ఆర్థికసాయం చెక్కును అందించారు. విద్యార్థి చదువు కోసం సహకారం అందించిన పట్టణ, పరిసర ప్రాంత ఆర్యవైశ్యులు, వైశ్య హాస్టల్ కమిటీ ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధి, వాణి శిశు మందిర్ 1988–89 పూర్వవిద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ బస్వా సిద్దేశ్వర్, చార్టెడ్ ప్రెసిడెంట్ గంధ వేణు, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్ కుమార్, సంతోష్ కుమార్, ఐతా శ్రీకాంత్, బస్వా పాండు, అమృత్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం




రఘునాథపల్లి: మండల కేంద్రంలోని అక్షయ హోటల్ ఎదుట ప్రవహిస్తున్న వాగులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అక్షయ హోటల్ ఎదుట వెల్ది నుంచి వచ్చే పెద్ద వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి బాలకిషన్‌గౌడ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాగులో నుంచి మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. మృతుడికి 40 నుంచి45 ఏళ్లు ఉంటాయని, బక్కగా ఫ్రెంచ్ గడ్డం కలిగి ఉన్నాడని, అతడి ఒంటిపై సిమెంట్ కలర్ చొక్కాపై ఆకుపచ్చని తీగల డిజైన్, నారింజ రంగు గల ప్యాంట్ ధరించి ఉన్నాడని, దుస్తుల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదు. కాగా మృతుడు రెండు రోజులుగా రహదారిపై సంచరిస్తున్నాడని,, అతడు యాచకుడు అయి ఉంటాడని ..? రాత్రి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటాడా..? మరేదైన కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురిలో భద్ర పరిచి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

'కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం'

కొడకండ్ల: కాంగ్రెస్ కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం కొడకండ్ల, రంగాపురం, మొండ్రాయి, మైదంచెరువుతండల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబసభ్యులతో పాటు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ యాకయ్యలను ఆమె పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

రోడ్ల మరమ్మతులను పట్టించుకోని పాలకులు



రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

రఘునాథపల్లి: పాలకుల వైఫల్యంతో పలు గ్రామాలు బీటీ రోడ్లకు నోచుకోవడం లేదని, ధ్వంసమైన రోడ్లు మరమ్మతులు కరువని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం మండలంలోని కోమళ్లలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి శివాజీనగర్, మల్లంపల్లి రోడ్లను పరిశీలించారు. ఉపేందర్, శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వ్యసనరహిత భారత్.. ఎన్‌ఎంబీఏ లక్ష్యం

- నేడు ప్రత్యేక దినోత్సవం
- విద్యాసంస్థలు, కళాశాలల్లో ప్రతిజ్ఞ

జనగామ: దేశ ప్రజలను మద్యపానం, పొగాకు, మత్తు పదార్థాలు వంటి వ్యసనాల నుంచి దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్(ఎన్‌ఎంబీఏ)ను అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం ప్రధానంగా గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహించబడుతుంది. ప్రజలకు వ్యసనాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం, పునరావాస సేవలు అందించడం, కౌన్సిలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, వ్యసనగ్రస్తులను సమాజంలో తిరిగి కలిపే చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా యువతలో మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించడం ఈ యోజన ప్రధాన లక్ష్యం. వ్యసన రహిత భారతం, ఆరోగ్యకరమైన భవిష్యత్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఈ అభియాన్ ముందుకు వెళ్తోంది. ఎన్‌ఎంబీఏ 5వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఈ నెల1వ తేదీ నుంచి 31 వరకు పాఠశాలలు, కళాశాలల్లో ప్రతి రోజు విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించాలి. నేడు(బుధవారం) మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు. మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామ్యం , డ్రగ్స్ రహిత జీవన శైలి, తనతో పాటు ఏ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా చూడడంతో పాటు అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణ వ్యక్తుల సమాచారాన్ని అధికారులకు చేరవేసి, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ సంకల్పంతో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయించాలి.

వినియోగంలోకి సోమనాథుడి స్మృతివనం

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సోమనాథుడి స్మృతి వనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: తొలి తెలుగు విప్లవ కవి, బసవ పురాణం గ్రంథకర్త పాల్కురికి సోమనాథుడి గుర్తుగా నిర్మించిన స్మృతి వనాన్ని వినియోగంలోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే స్మృతి వనాన్ని సందర్శించి పరిశీలించారు. స్మృతి వనం అపరిశుభ్రతతో పశువులకు నిలయంగా మారడంతో ఆవేదన వ్యక్తం చేశారు. స్మృతి వనాన్ని అభివృద్ధి చేసి భావితాలకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆమె వెంట నాయకులు ఉన్నారు.

సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి తోపాటు వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పట్ల దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే నియోజకవర్గ స్థాయి సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు సూచించారు. మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలన్నారు. సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 168మంది లబ్ధిదారులకు రూ.51లక్షల 90వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

సంక్షేమ పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న అపర్ణ

జనగామ రూరల్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ అపర్ణ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికె ఇందిర ఆధ్వర్యంలో జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ మట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి అందజేస్తున్న ఆరు గ్యారంటీలను గడపగడపకు వెళ్లి వివరించి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. జనరల్ సెక్రెటరీ శ్రీలత రెడ్డి, సెక్రెటరీ మౌనిక, వైస్ ప్రెసిడెంట్ మున్ని బేగం , జనరల్ సెక్రెటరీ సక్కుబాయి, బ్లాక్ అధ్యక్షురాలు తార, మండల అధ్యక్షురాలు మాలతి రెడ్డి, బూత్ కమిటీ మెంబర్స్ కౌసల్య, లక్ష్మి, ఆండాళ్, హేమలత, నవనీత, దనలక్ష్మి, అరుణ పాల్గొన్నారు

భూసమస్యలను పరిష్కరించాలి

- ఆర్డీఓ గోపీరామ్



మాట్లాడుతున్న ఆర్డీఓ గోపీరామ్

బచ్చన్నపేట: భూభారతి రెవెన్యూ సదస్సుల్లో ఆయా గ్రామాల వారీగా వచ్చిన భూ సమస్యల దరఖాస్తులను పరిష్కరించాలని జనగామ ఆర్డీఓ గోపీరామ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో సందర్శించి భూ సమస్యలను పరిష్కరించాలని ఎంఆర్‌ఐలకు సూచించారు. తహసీల్దార్ రామానుజాచారి, డిప్యూటీ తహసీల్దార్ శంకర్, ఎంఆర్‌ఐలు వంశీకృష్ణ, మున్వర్, సిబ్బంది యాకయ్య పాల్గొన్నారు.

దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలి

చిల్పూరు: మండలంలో భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వెంకన్న అన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. నేటి నుంచి 16 వరకు భారీ వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్సై నవీన్‌కుమార్‌లు తెలిపారు. ఆర్‌ఐ తూలూరి లోకేష్, ఏఆర్‌ఐ భుక్కి అర్జున్, సినియర్ అసిస్టెంట్ కల్వల శ్రీనివాస్ ఉన్నారు.

నియామకం



రఘు

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక సలహాదారులుగా మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రాఘును నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రాంజన్ ఉత్వర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ తన నియమకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝన్సీరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులు, కుంటలకు జలకళ



చెరువు వద్ద పూజలు చేస్తున్న రాంబాబు, జగదీష్‌చందర్‌రెడ్డి

రఘునాథపల్లి: ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృషితో మండలంలోని చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇబ్రహీంపూర్ పెద్ద చెరువు నిండి అలుగు పోస్తుండటంతో మంగళవారం కాంగ్రెస్ నాయకులు, రైతులతో కలిసి వారు మత్తడి వద్ద కొబ్బరి కాయలు కొట్టి గంగాదేవికి పూజలు చేసి మాట్లాడారు. రైతుల సాగుకు ఇబ్బందులు రాకుండా ఎమ్మెల్యే చెరువులు నింపేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కోళ్ల రవిగౌడ్, నామాల బుచ్చయ్య, గాదె మహేందర్‌రెడ్డి, తోటకూరి రమేష్, ఎండీ బాషుమియా, పర్ష సిద్దేష్, పోకల శ్రీనివాస్, కాసర్ల లక్ష్మయ్య, గ్యార ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌కు తెలంగాణ కళాకారులు



న్యూజిలాండ్‌కు బయలు దేరిన కళాకారులు

జనగామ: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని ఈ నెల 14 నుంకచి 18వ తేదీ వరకు హై కమిషనర్ ఫర్ ఇండియా, వెల్లింగ్టన్ కాన్సులేట్ జనరల్ అఫ్ ఇండియా, ఆక్లాండ్, ఇన్ కొలాబరేషన్ విత్ సీడీ ఫౌండేషన్(ఇండియా), తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖల ఆధ్వర్యంలో న్యూజిలాండ్‌లో నిర్వహించే వేడుకలకు జనగామకు చెందిన కళాకారులతో పాటు తెలంగాణ నుంచి 11 మంది మంగళవారం బయలుదేరి వెళ్లారు. పేరణి నృత్య విభాగంలో జనగామకు చెందిన పెరుమాండ్ల సంతోష్ ప్రదర్శన చేయనున్నారు.

విద్యార్థి ఉద్యమానికి నాంది ఏఐఎస్‌ఎఫ్

స్టేషన్‌ఘన్‌పూర్: భారత విద్యార్థి ఉద్యమానికి ఏఐఎస్‌ఎఫ్(అఖిల భారత విద్యార్థి సమాఖ్య) నాంది యని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ ఎండీ.యూనస్ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాన్ని ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన యూనస్ ఏఐఎస్‌ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎండీ.రహ్మతుల్లా, పస్తం పృథ్వీరాజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. రైతుల హర్షం



దేవరుప్పుల: జెరిపోతుల వాగు ఉధృతితో ఇబ్బంది పడుతున్న వాహనదారులు



కొడకండ్ల: నిండిన రామవరం పాత చెరువు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండి మత్తళ్లు పోస్తున్నాయి. చెరువులు మత్తడి పోస్తుండటంతో గ్రామాల్లో సందడి నెలకొంది. రెండు పంటలు సాగు చేయవచ్చని ఆయకట్టు రైతులు, మత్స్యసంపద పెరుగుతుందని ముదిరాజ్ కులస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం లేక ఎండలు తీవ్రంగా మండిపోవడంతో పత్తి మొక్కలు వాడిపోతూ రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్న తరుణంలో భారీ వర్షం ఊరటనిచ్చి మొక్కలకు జీవం పోసినట్లయింది. కాగా, కొడకండ్ల మండలంలోని గుమ్మలబండ తండా నుంచి నల్లెల్లగడ్డ తండకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డుపై కంకరపోసి బీటీ వేయకుండానే అసంపూర్తిగా వదిలేశారు. భారీ వర్షంతో వరద నీటికి రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దేవరుప్పుల మండలంలోని రామచంద్రపురంలోని రామ సముద్రం చెరువు అలుగు పోసే స్థాయికి చేరింది. ఇదే గ్రామంలోని చెరువులోకి వచ్చే జేరిపోతుల వాగు వరదలతో ఒక్క రోజు స్థానికులకు రాకపోకల ఇబ్బందులు ఏర్పడ్డాయి.



కొడకండ్ల: కొట్టుకుపోయిన నల్లెల్లగడ్డ తండా రోడ్డు

'డబుల్' ఇళ్లు ఇవ్వాలని ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

జనగామ రూరల్: నర్మెట మండలంలోని వెల్దండ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూంలు తమకు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు మంగళవారం రాత్రి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు సుంచు విజేందర్, బొట్ల శేఖర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. తక్షణమే విచారణ చేసి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఐ దామోదర్ ధర్నా వద్దకు చేరుకుని సీపీఎం నాయకులను సముదాయించారు. ఆర్డీఓ గోపిరామ్ చేరుకుని బాధితులతో మాట్లాడారు. నెలరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. నాయకులు తూటి దేవదానం, గడ్డం యాదగిరి, బొట్ల శ్రవన్, సుమ, బాధితులు సావిత్ర కొమురమ్మ, అనిత, ఆర్య తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా వాసి మృతి

- రెండురోజులుగా వానలోనే..



వెంకటేశ్ మృతదేహం

జనగామ: జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రధాన గేటు సమీపంలో రెండు రోజులుగా ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తీవ్ర అనారోగ్యం పాలైన కామారెడ్డి జిల్లా హెడ్ క్వార్టర్ హరిజనవాడకు చెందిన అనాథ నిమ్మల వెంకటేశ్(51) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. ఆస్పత్రి సమీపంలో నేలపై లేచి నిలబడలేని దయనీయ స్థితిలో ఆపన్న హస్తం కోసం అర్థించినా.. ఎవరూ కనికరించలేదు. కనీసం పక్కనే ఉన్న ఆస్పత్రిలో చేర్పిద్దామనే మానవత్వం ప్రదర్శించ లేదు. ఈ క్రమంలో వెంకటేశ్‌ను సాక్షి రిపోర్టర్ చూసి చలించి.. ముస్లిం యువ నాయకుడు సలీంతో కలిసి ఈ నెల 11వ తేదీన ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వెంకటేశ్ మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి పోస్టుమార్టం ఫ్రీజర్‌లో భద్రపరిచారు. ఆయన మృతదేహం కోసం జనగామ పోలీసులు 8712685259, 8712685260 నంబర్లను సంప్రదించాలని ఎస్సై రాజేష్ తెలిపారు.

మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయం

- మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్



జనగామ రూరల్: మాట్లాడుతున్న శివరాజ్

జనగామ రూరల్: మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వం ధ్యేయమని జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో స్థానిక చాకలి ఐలమ్మ మహిళా సమాఖ్య సముదాయంలో మండలంలోని దివ్య జ్యోతి మండల సమాఖ్య సమావేశానికి అయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ గ్రామంలో మహిళలు ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో కోటీశ్వరులు కావాలనేది సీఎం ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఏ నూరుద్దీన్, శంకరయ్య, శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ మహిళను సభ్యురాలిని చేయాలి

లింగాలఘణపురం: గ్రామాల్లోని కిశోర్ బాలికలు మొదలుకుని వృద్ధురాలి వరకు ప్రతీ మహిళను స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలిగా చేర్పించాలని ఏడీఆర్‌డీఓ నూరుద్దీన్ కోరారు. ఇందిరా మహిళా శక్తి మిషన్–2025లో భాగంగా మండలంలోని వీఓలు, వీఓఏలకు సోషల్ మొబిలైజేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఆర్‌డీఓ నూరుద్దీన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు కాటం రమ్యశ్రీ, ఏపీఎం నాగేశ్వర్‌రావు, సీసీలు శ్రీకాంత్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీమతి 43 గ్రామైక్య సంఘాల వీఓ, వీఓఏలు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి మిషన్‌పై అవగాహన

తరిగొప్పుల: జీవనజ్యోతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి మిషన్‌పై మంగళవారం స్థానిక రైతు వేదిక ఆవరణలో వీఓ, వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏపీఎం నరేందర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి మిషన్ సామాజిక సమీకరణపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి , సమైక్య పాలక వర్గం మాధవి, రామాదేవి, రమ్య, సీసీలు రాములు,సిద్దులు తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం



తరిగొప్పుల: హనుమకొండ పట్టణానికి చెందిన నెల్లుట్ల జనార్ధన్‌రావు ఆర్థిక సహకారంతో మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూ.13,500 విలువగల క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ నెల్లుట్ల జానకి మాట్లాడుతూ దాతలు క్రీడాకారులకు సహకారం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి,కాంప్లెక్స్ హెచ్‌ఎం బానోతు రవీందర్, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అనిత, కృష్ణజా, అరుణదేవి, బాలథెరిస్సా, వసంత్ నాయక్, నాగార్జున రావు, లక్ష్మి పాల్గొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే పూర్వవైభవం

దేవరుప్పుల: ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం సాధ్యమని హెచ్‌ఎం అంబటి అంజయ్య అన్నారు. మంగళవారం సింగరాజుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఎస్‌ఎంసీ పూర్వ చైర్మన్ తాళ్లపల్లి ఐలయ్య రూ.6 వేలతో టై, బెల్టులు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాధవి, చైతన్య సునీత, శ్రావణి పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

బచ్చన్నపేట: జీపీ కార్యాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. మంగళవారం కొడవటూర్ గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి బ్యుంగి రూపా చైతన్య, అంగన్‌వాడీ టీచర్ ప్రేమలక్ష్మి, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో పోలీసుల ప్రతిభ



దేవరుప్పుల: పంద్రాగస్టు పురస్కరించుకుని కలెక్టర్ ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ స్టేడియంలో మంగళవారం తలపెట్టిన జిల్లా ఎంప్లాయిస్ స్పోర్ట్స్ మీట్‌లో మండల పోలీసులు రెండు విభాగాల్లో ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానం పొందారు. చెస్ విభాగంలో ఎస్సై ఊర సృజన్‌కుమార్, క్యారమ్స్‌లో యాకేష్, అశోక్‌లు తమ ప్రతిభ చాటి ఐదు విభాగాల ఆటల్లో రెండు విభాగాల్లోనూ మండల పోలీసులు గెలువడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పెద్ద చెరువు గండి పూడ్చివేత

జఫర్‌గఢ్: సోమవారం రాత్రి కురిసిన వర్షంతో జఫర్‌గఢ్ పెద్ద చెరువు తూముకు పెద్ద గండి ఏర్పడింది. విషయాన్ని స్థానిక రైతులు సంబంధిత అధికారులకు తెలుపడంతో తహసీల్దార్ రాజేష్‌రెడ్డి సిబ్బందితో కలిసి పెద్ద చెరువును మంగళవారం సందర్శించారు. గండిని పరిశీలించి సంబంధిత అధికారులకు వివరించడంతో పొక్లెయినర్ యంత్రం ద్వారా గండిని పూడ్చి వేశారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

జనగామ రూరల్: పసరమడ్ల గ్రామం పరిధిలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎమ్ స్వాతి మాట్లాడుతూ విద్యార్థులు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. హెచ్‌ఎం జె.లచ్చిరాం, స్టాఫ్ సెక్రెటరీ బి.వాసు, ఉపాధ్యాయుడు బి.జయరాం పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా శ్రీరేణుకా ఎల్లమ్మతల్లికి బోనాలు



స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం గౌడ కులస్తులు ఉమ్మడిగా రేణుకా ఎల్లమ్మ తల్లికి ఘనంగా బోనాలు చేశారు. ఉదయాన్నే గౌడ కులస్తులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని నైవేద్యం సమర్పించారు.

ప్రత్యేక పూజలు

జనగామ రూరల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉన్న రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం అమ్మవారు పసుపు కొమ్ముల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. మహిళలు అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన పూజలు చేశారు. అర్చకుడు మారుపాక శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొడకండ్ల: మండలకేంద్రంలోని కస్తూర్బా విద్యాలయానికి అటాచ్‌లో ఉన్న మోడల్‌స్కూల్ బాలికల హస్టల్‌లో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టుకు బుధవారం సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా విద్యాలయ ఎస్‌ఓ జ్యోతి ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఏఎన్‌ఎం శిక్షణ పొందిన మహిళలు ఈ పోస్టుకు అర్హులని, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన నెలకు రూ.7,800 అందించడం జరుగుతుందని, హాస్టల్‌లోనే విద్యార్థులతో ఉండాల్సి ఉంటుందని, మండలంలోని అర్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని, వివరాల కోసం 9505798098 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని ఆమె తెలిపారు.

సన్మానం

దేవరుప్పుల: మండల కేంద్రానికి చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఇటీవల డాక్టరేట్ పొందిన అన్నెపు యాకయ్యను ముదిరాజ్ సంఘం మంగళవారం మేడ్చల్ ఏరియా కండ్లకోయలో ఘనంగా సన్మానించింది. తెలంగాణ ప్రభుత్వం ఇంటింటా తాగునీటీ అందిస్తున్న మిషన్ భగీరథ పథకం విశిష్టతపై కంటిచూపు సరిగా లేని దివ్యాంగుడు అన్నెపు యాకయ్య క్షేత్రస్థాయి పరిశోధనలు చేసి డాక్టరేట్ పట్టా పొందింది విదితమే. ఇలాంటి ఉన్నత విద్యార్థులను మరింతి ప్రోత్సహించే దిశలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు నీలం మధు ఆధ్వర్యంలో సన్మానించి జ్ఞాపికను అందించారు.

గుంతల రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

బచ్చన్నపేట: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ నుంచి కొడవటూర్ కమాన్ వరకు ఉన్న రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సుంచు విజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రోడ్డుపై గుంతల్లో గ్రామస్తులతో కలిసి వరినాట్లు వేసి నిరసన తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

దేవరుప్పుల: ప్రమాదవ శాత్తు ఓ కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన సంఘటనలో ప్రాణాపాయం తప్పిన సంఘటన మంగళవారం దేవునిగుట్ట తండాలో చోటుచేసుకుంది. మంగళవారం మాదాపురం రెవెన్యూ పరిధి దేవునిగుట్టతండాకు నర్సంపేటకు చెందిన వ్యక్తులు కారులో బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో తండాలో రోడ్డు పక్క విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. విరిగిన స్తంభంతో సహా కరెంటు వైర్లు కారు ఇంజన్ భాగంపై పడ్డాయి. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు ప్రాణాపాయం తప్పిందని తండా వాసులు పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించొద్దు



ఇరుపక్షాలతో మాట్లాడుతున్న ఆర్డీఓ, ఎస్సై

చిల్పూరు: కృష్ణాజీగూడెంలో పేదల కోసం గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించొద్దని కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం గ్రామ అధ్యక్షులు సాదం రాజేందర్, పోలు సంపత్, సాదం బీములు అన్నారు. ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించవద్దంటూ మంగళవారం బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు అడ్డుకోవడంతో ఎస్సీలకు పార్టీ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న ఆర్డీఓ వెంకన్న, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ చేరుకుని హామీ ఇవ్వడంతో సద్దుమణిగింది.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం భక్తజన సందోహం నడుమ ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి దంపతుల ఆధ్వర్యంలో అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న, సూపరింటెండెంట్ వెంకయ్య, వీరన్న, కృష్ణ, హరిశంకర్ భక్తులు పాల్గొన్నారు.